సాక్షి తిరుపతి

గురువారం । 12 । అక్టోబర్ । 2023



నేర నియంత్రణే లక్ష్యంగా విధులు

నేర నియంత్రణే లక్ష్యంగా పోలీసులు పనిచేయాలని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. - 8లో



పాడి రైతుకు మరింత 'సహకారం'

పాడి రైతులకు మరింత అండగా నిలుస్తున్నట్లు కాళహస్తి కో-ఆపరేటివ్ పాల సరఫరా సంఘం తెలిపింది. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	35	23
చిత్తూరు	33	22
తిరుమల	31	18
గూడూరు	36	24
నగరి	35	23

న్యూస్‌రీల్

ఉత్తమ పంచాయతీగా 'మేనకూరు'



ఐఎస్‌ఓ అవార్డు అందిస్తున్న ఐఏఎస్ అధికారి శ్రీషా

నాయుడుపేట : మండలంలోని మేనకూరు ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. ఐఎస్ఓ (ఇండియన్ స్టాండర్డ్ ఆఫ్ ఆర్గనైజేషన్) అవార్డు దక్కించుకుంది. బుధవారం ఈ మేరకు ఐఏఎస్ అధికారి కె.శ్రీషా చేతుల మీదుగా సర్పంచ్ సురేష్, జెడ్పీటీసీ సభ్యులు కట్టా జ్యోతి రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి, అధికారులు అవార్డు అందుకున్నారు. కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ గౌరవ సభ్యురాలైన శ్రీషా క్షేత్రస్థాయిలో పంచాయతీలో పర్యటించి అవార్డుకు ఎంపిక చేశారు. డీఎల్‌పీఓ వెంకటరమణ మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలోని మేనకూరు , చంద్రగిరి నియోజవర్గంలోని పాకాల పంచాయతీలను ఐఎస్ఓ ఎంపిక చేసినట్లు వెల్లడించారు. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో చేపట్టిన అభివృద్ధి పనుల కారణంగానే మేనకూరుకు అవార్డు వచ్చిందని వివరించారు. ఈఓపీఆర్డీ భువనేశ్వర శర్మ, పంచాయతీ కార్యదర్శి గోపాల్ పాల్గొన్నారు.

15న కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఉప్పరపల్లెలోని ఎస్వీ డిఫెన్స్ అకాడమీ మైదానంలో ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు స్కూల్ గేమ్స్ అండర్-19 ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలబాలికల కబడ్డీ జట్లను ఎంపిక చేయనున్నారు. బుధవారం ఈ మేరకు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.జయరామయ్య వివరాలు వెల్లడించారు. ఇంటర్ చదువుతున్నవారు మాత్రమే ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఆసక్తిగల వారు పదోతరగతి మార్కుల లిస్టు, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డును తీసుకురావాలని సూచించారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 8 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 71,361 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 24,579 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.69 కోట్ల ఆదాయం వచ్చింది. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

ముక్కంటి హుండీ లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద బుధవారం హుండీ లెక్కింపు చేపట్టారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా మొత్తం రూ.1,07,26,637 నగదు, 35గ్రాముల బంగారం, 348.6 కేజీల వెండి, 67 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్లు ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు తెలిపారు.

పూర్థిస్థాయి వీసీగా రాణిసదాశివమూర్తి



వీసీగా బాధ్యతలు చేపడుతున్న రాణిసదాశివమూర్తి

తిరుపతి సిటీ : ఎస్వీ వేద విశ్వవిద్యాలయం పూర్తిస్థాయి వీసీగా రాణి సదాశివమూర్తిని నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గవర్నర్ అబ్దుల్ నజీర్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్రపంచంలోనే ఏకైక వేద విశ్వవిద్యాలయం తిరుపతిలో టీటీడీ ఆధ్వర్యంలో నెలకొల్పారని తెలిపారు. ఇక్కడ తాళపత్ర గ్రంథాల డిజిటలైజేషన్, పరిశోధనల విషయంలో శక్తి వంచన లేకుండా కృషిచేస్తామని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి,, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. రిజిస్ట్రార్ రాధేశ్యామ్, గోలి సుబ్రమణ్యం, పీఆర్వో బ్రహ్మాచారి పాల్గొన్నారు.

అడుగు దూరంలో అటానమస్

ఆధ్యాత్మిక క్షేత్రం తిరునగరిని చదువుల కోవెలగా తీర్చిదిద్దడంలో టీటీడీ తన వంతు పాత్ర పోషిస్తోంది. అత్యున్నతంగా కళాశాలలను నిర్వహిస్తూ వేలాది జీవితాల్లో వెలుగులు నింపుతోంది. అత్యాధునిక వసతులు.. అత్యుత్తమ బోధనతో విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేస్తోంది. ఇప్పటికే నాక్ ఏ ప్లస్ గుర్తింపు సాధించి జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించింది. ఈ క్రమంలో టీటీడీ ఆధ్వర్యంలో పురోగమిస్తున్న మూడు కళాశాలలకు 'అటానమస్' హోదా దక్కనుంది. ఈ మేరకు అతి త్వరలోనే యూజీసీ ఆమోదం లభించనుంది.

- టీటీడీ విద్యా సంస్థలకు స్వయం పాలక హోదా
- అతి త్వరలో ఆమోదించనున్న యూజీసీ
- ఇప్పటికే డిగ్రీ కళాశాలలకు నాక్ ఏ ప్లస్ గ్రేడ్
- చదువుల కోవెలగా తిరునగరం



ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రధాన భవనం



ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రధాన భవనం

తిరుపతి సిటీ : తిరుపతి తిరుమల దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న డిగ్రీ విద్యా సంస్థలకు అటానమస్ (స్వయం పాలక) హోదా దక్కనుంది. ఈ మేరకు ఢిల్లీలోని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ కసరత్తు ప్రారంభించింది. ఈ మేరకు కళాశాల అధికారులు దరఖాస్తుతోపాటు అవసరమైన ప్రామాణిక పత్రాలను యూజీసీకి సమర్పించారు. సుమారు 60 నుంచి 70 ఏళ్లుగా ఎస్వీ యూనివర్సిటీ అనుబంధంగా నడుస్తున్న టీటీడీ డిగ్రీ కళాశాలలు ఇప్పటికే నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించాయి. ఈ క్రమంలో టీటీడీ మరో అడుగు ముందుకు వేసి స్వయం పాలక హోదా సాధించేందుకు విద్యాశాఖ అధికారులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బందిని అప్రమత్తం చేసింది. కళాశాలలలో కార్పొరేట్ విద్యా సంస్థలలో సైతం లేని సౌకర్యాలను, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అభివృద్ధి చేసింది. దీంతో నాక్ బృందం కళాశాలలను పూర్తిస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి ఏ ప్లస్ గ్రేడ్ అందించింది. అటానమస్ హోదాకు నాక్ ఏ ప్లస్ గ్రేడే ప్రామాణికంగా తీసుకోవడం గమనార్హం.



శ్రీపద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల భవనం

ఉపయోగాలు ఇవీ..

స్వయం పాలక హోదా సాధించిన కళాశాలలకు స్వతహాగా నిర్ణయాలు తీసుకునే అధికారం ఉంటుంది. విద్యావిధానం, పరీక్షల నిర్వహణ, పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనే సామర్థ్యాలను పెంపొందించుకునేందుకు సిలబస్‌లో మార్పులు, సామాజిక సేవా దృక్పథంతో విద్యార్థులకు బోధన, ఆధునిక సాంకేతికత ఆధారంగా కోర్సుల నిర్వహణ, మెమొరీ బేస్డ్ విద్యావ్యవస్థ ఏర్పాటు వెసులుబాటు వస్తుంది. ప్రాంగణ ఎంపికలకు ప్రపంచ స్థాయి సంస్థలు ముందుకు వస్తాయి. అలాగే కళాశాల అభివృద్ధికి సొంతంగా నిర్ణయాలు తీసుకోవచ్చు.

మూడు డిగ్రీ కళాశాలలకు హోదా

టీటీడీ విద్యాసంస్థలైన శ్రీపద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, శ్రీగోవిందరాజస్వామి డిగ్రీ కాలేజీ అటానమస్ హోదా జాబితాలో ఉన్నాయి. ప్రధానంగా ఆయా కళాశాల్లో విద్యావిధానం, అధ్యాపకుల బోధనా సామర్థ్యం, కాలేజీ, హాస్టల్ భవనాలు, విద్యార్థుల సంఖ్య, అభ్యసన సామర్థ్యాలు, ల్యాబ్‌లు, ప్లేగ్రౌండ్, ఆర్థిక వనరులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ద్వారా చేపడతున్న సమాజ సేవా కార్యక్రమాలు, ఉపాధి కల్పన, ప్రాంగణ ఎంపికలు, విద్యార్థుల నైపుణ్యాలను నాక్ బృందం తనిఖీ చేసి గ్రేడింగ్‌ను ఇస్తుంది. ఇందులో ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించిన తర్వాత టీటీడీ డిగ్రీ కళాశాలలకు నాక్ ఏ ప్లస్ గ్రేడ్ వచ్చింది. దీంతో స్వయం పాలక హోదా సాధించేందుకు ఈ మూడు కళాశాలలకు మార్గం సుగమమైంది.

త్వరలో సాధిస్తాం



మూడు కళాశాలలకు అటానమస్ సాధించేందుకు యూజీసీకి దరఖాస్తు చేశాం. త్వరలోనే ఆ గౌరవం సాధిస్తాం. కార్పొరేట్ సంస్థల్లో లేని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ టీటీడీ విద్యాసంస్థలకు ఉంది. రూ.వందల కోట్ల ఖర్చు చేసి కళాశాలల అభివృద్ధికి చర్యలు చేపట్టాం. అందుకే నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించాం. టీటీడీ బోర్డు చైర్మన్, ఈఓ, జేఈఓలు ఎప్పటికప్పుడు కళాశాల్లో విద్యార్థుల సౌకర్యాలు, బోధనా విధానాలను పరిశీలిస్తున్నారు.

– డాక్టర్ ఎం.భాస్కర్‌రెడ్డి, టీటీడీ డీఈఓ, తిరుపతి

తొలి ప్రయత్నంలోనే నాక్ ఏ ప్లస్ గ్రేడ్



శ్రీ గోవిందరాజస్వామి డిగ్రీ కళాశాలకు తొలి ప్రయత్నంలోనే నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించాం. కళాశాలలో 19 డిపార్ట్‌మెంట్లు, 19 కోర్సులతో అధునాత వసతులు ఉన్నాయి. కొత్తగా 4ఏళ్ల హానర్స్ డిగ్రీ కోర్సు అందిస్తున్నాం. 1969లో ఏర్పాటు చేసిన ఈ కళాశాలలో నిపుణులైన అధ్యాపకులతో విద్యాబోధన సాగుతోంది. 2,200 మంది విద్యార్థులు చదువుతుండగా, 1,500మందికి హాస్టల్ వసతి కల్పించాం. త్వరలో అటానమస్ సాధించి సమూల మార్పులు తీసుకొస్తాం.

– డాక్టర్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్, ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల, తిరుపతి

టీటీడీ సహకారంతోనే..



టీటీడీ సహకారంతోఆపటు కళాశాల సిబ్బంది, విద్యార్థుల సమిష్టి కృషితో నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించాం. నాణ్యమైన విద్యతో పాటు ఉపాధి అవకాశాలను పెంపొందించేందు చర్యలు చేపట్టాం. 1952లో స్థాపించిన ఈ కళాశాల అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతోంది. మొత్తం 2,700మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఏడు బ్లాకుల హాస్టల్స్‌లో 2,300 మంది వసతి పొందుతున్నారు. నూతన విద్యావిధానంలో భాగంగా ఈ ఏడాది నుంచి హానర్స్ డిగ్రీ అందుబాటులోకి తీసుకువచ్చాం.

– డాక్టర్ కె.మహదేవమ్మ, ప్రిన్సిపల్, పద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల, తిరుపతి

హోదా వస్తుంది



స్వయం పాలక హోదా సాధించేందుకు కళాశాలకు అన్ని అర్హతలు ఉన్నాయి. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల 1945లో స్థాపించారు. ప్రస్తుతం 3వేల మంది విద్యార్థులు 20 డిపార్టుమెంట్స్‌లో చదువుతున్నారు. ముఖ్యమంత్రులు, ఉన్నతాధికారుల, రాజకీయ నేతలు ఈ కళాశాలలోనే విద్యాభ్యాసం చేయడం గర్వకారణం. ఇక్కడ అత్యాధునిక ల్యాబ్‌లు, తరగతి గదులు, నూతన హాస్టల్ భవనాలను టీటీడీ రూ.కోట్లు ఖర్చు చేసి అందుబాటులోకి తెచ్చింది. అందరి సహకారంతో నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించాం. త్వరలో అటానమస్ హోదా సైతం వస్తుంది.

– డాక్టర్ టి.నారాయణమ్మ, ప్రిన్సిపల్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, తిరుపతి

---

16 నుంచి ఈవీఎంల తనిఖీ

రేణిగుంట : స్థానిక పాత విమానాశ్రయ మార్గంలోని సీడబ్ల్యూసీ గోదాము వద్ద ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ వెంకటరమణారెడ్డి బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ నుంచి ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్ చేపటనున్నట్లు తెలిపారు. కంప్యూటర్, ప్రింటర్, స్కానర్, విద్యుత్ సాకెట్స్ ఏర్పాటు, లైటింగ్, ద్వారాలకు మెష్ ఏర్పాటు, టేబుల్, కుర్చీలు, ఇంటర్నెట్ సౌకర్యం, నిరంతర లైవ్ వెబ్ కెమెరాలపై సమగ్ర పర్యవేక్షణ ఉండాలని ఈవీఎం గోడౌన్ ఇన్‌చార్జి శ్రీనివాసులు, కోదండరామిరెడ్డిని ఆదేశించారు. 15వ తేదీ నాటికి ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలకు ఎఫ్ఎల్‌సీ సమాచారం అందించాలని సూచించారు. ఫస్ట్ లెవల్ చెకింగ్‌లో ఓటింగ్ యంత్రాల అనుసంధానం ద్వారా వాటి పనితీరును పరిశీలించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి, ఎన్నికల సెక్షన్ తహసీల్దార్ సురేష్, గోడౌన్ మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.



సూచనలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

అన్నదాతకు వెన్నుదన్నుగా ఆర్‌బీకేలు

నగరి : అన్నదాతకు వెన్నుదన్నుగా రైతు భరోసా కేంద్రాలు నిలుస్తున్నాయని పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. బుధవారం మండలంలోని ఓజీ కుప్పం గ్రామంలో రూ.21.8 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తు నుంచి విక్రయం దాకా ఒకేచోట అందించాలన్నదే లక్ష్యంతోనే ఆర్‌బీకే వ్యవస్థకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. అన్నదాతలకు ఆర్‌బీకేలు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. గ్రామాల్లో రైతులకు పలు మార్పులు ఆర్‌బీకేలతో కనిపిస్తున్నాయన్నారు. సమాచారంతో పాటు అన్ని వ్యవసాయ పనులకు ఆర్‌బీకేలు కేంద్ర బిందువుగా మారాయని తెలిపారు. రైతుకు కావలసిన సేవలన్నీ ఇంటి ముంగిటే చేరువయ్యాయన్నారు. గతంలోలా విత్తనాల కోసం పడిగాపులు, ఎరువుల కోసం ఆందోళనలు ఇప్పుడు లేవన్నారు. ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు కన్నియప్ప, ఢిల్లి, కోఆప్షన్ సభ్యులు దస్తగిరి, ఎంపీడీవో లీలామాధవి, వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరి, సర్పంచ్‌లు మోహన్, రవికుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.




ఓజీకుప్పంలో రైతు భరోసా కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

స్వగృహప్రవేశం

పేదల జీవితాల్లో నవరత్న వెలుగులు నిండుతున్నాయి. సొంతింటి కలలు సాకారమవుతున్నాయి. జగనన్న కాలనీల పేరిట ఎక్కడికక్కడ కొత్త ఊళ్లే వెలుస్తున్నాయి. అందులో భాగంగా నూతనంగా నిర్మించిన గృహాలు గురువారం ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు వడమాలపేటలోని కాయం లేఅవుట్‌లో లబ్ధిదారులు సంతోషంగా తమ ఇళ్లలోకి ప్రవేశించనున్నారు. ఇందుకోసం జిల్లా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. పండుగ వాతావరణంలో కార్యక్రమం నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు.

- నేడు వడమాలపేట కాయం లేఅవుట్‌లో ఇళ్ల ప్రారంభోత్సవం
- ఇక వరుసగా జగనన్న కాలనీల్లో శుభ ముహూర్తాలు
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ వెంకటరమణారెడ్డి



కాయం గ్రామంలోని జగనన్న కాలనీ

తిరుపతి అర్బన్ : నవరత్నాలు– పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా భారీ సంఖ్యలో ఇంటి స్థలాలు మంజూరు చేసింది. మొత్తం 577 జగనన్న లేఅవుట్లలో 92,710 మందికి పట్టాలు అందజేసింది. లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.1.80 లక్షల చొప్పున పంపిణీ చేసింది. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 31,692 ఇళ్లు పూర్తయ్యాయి. మరో 61,018 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి.

నేడు కాయం లేఅవుట్‌లో శ్రీకారం

రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న లేఅవుట్లలోని 5లక్షలకు పైగా ఇళ్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ప్రారంభోత్సం చేయనున్నారు. ఈసందర్భంగా వడమాలపేట మండలంలోని కాయం గ్రామం వద్ద ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లో మొత్తం 780 ఇళ్లకు గాను 420 గృహాల్లో లబ్ధిదారులు ప్రవేశం చేయనున్నారు. బుధవారం ఈ మేరకు కలెక్టర్ వెంకటరమణారెడ్డి క్షేత్రస్థాయిలో కాయం లేఅవుట్‌ను పరిశీలించారు. ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సూచనలందించారు.



లేఅవుట్ పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

పకడ్బందీ చర్యలు



జిల్లాలోని మొత్తం 577 జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాం. ఇప్పటికే పెద్దసంఖ్యలో గృహాలు పూర్తయ్యాయి. ఇక నుంచి వరుసగా గృహ ప్రవేశాలు సాగుతాయి. ఎక్కడికక్కడ స్థాని ప్రజాప్రతినిధులతో ప్రారంభోత్సవాలు చేయిస్తాం. లబ్ధిదారులు కూడా తమ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకునేందుకు పనులను వేగవంతం చేయాలి.

– వెంకటేశ్వరరావు, హౌసింగ్ పీడీ, తిరుపతి

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్

తిరుపతి రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు తెలిపారు. బుధవారం తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులు అడిగిన వెంటనే విద్యుత్ సర్వీసులు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. అందులో భాగంగా 2019 నుంచి ఇప్పటి వరకు మొత్తం 2.34 లక్షల వ్యవసాయ విద్యుత్ సర్వీసులను విడుదల చేశామని వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్డీఎస్ఎస్ పథకం కింద 3,900 ఫీడర్లను వేరు చేస్తున్నామని తెలిపారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో కూడా నిరంతరాయంగా 3 ఫేజ్ విద్యుత్ సరఫరా చేసే వెసులుబాటు ఉంటుందని చెప్పారు. ఈ పథకం కింద చేపట్టే పనులకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం గ్రాంటు మంజూరు చేస్తుందని, మిగిలిన 40శాతం మాత్రమే సంస్థ భరించాల్సి ఉంటుందని వివరించారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో వివిధ పరికరాల కొనుగోలుకు జెమ్ పోర్టల్ ద్వారా టెండర్లు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఆర్డీఎస్ఎస్ కింద 11 కేవీ వీసీబీలు 2,807 సరఫరా చేసేందుకు టెండర్లు పిలిచామని, భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్)/ హైదరాబాద్, స్టైల్మెక్ లిమిటెడ్/ముంబయి, మెగావిన్ స్విచ్ గేర్ ప్రైవేట్ లిమిటెడ్ / సేలం సంస్థలు పాల్గొన్నాయని వివరించారు. అందులో స్టైల్మెక్ లిమిటెడ్ / ముంబయి, మెగావిన్ స్విచ్ గేర్ ప్రైవేట్ లిమిటెడ్/ సేలం సంస్థలు సాంకేతిక అర్హత సాధించాయని తెలిపారు. గతంలో బీహెచ్‌ఈఎల్ సరఫరా చేసిన వీసీబీల సర్వీసులు మెరుగ్గా లేకపోవడంతో ఈ పర్యాయం వారి టెండర్లను పరిగణనలోకి తీసుకోలేదని స్పష్టం చేశారు. పంజాబ్ రాష్ట్ర విద్యుత్ సంస్థ, పాటియాలా కూడా బీహెచ్‌ఈఎల్‌ను 2025 వరకు బ్లాక్ లిస్టులో పెట్టిందని వెల్లడించారు. ఈ క్రమంలోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడిపై కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించినట్లు తెలిపారు. స్టార్ రేటెడ్ ట్రాన్స్‌ఫార్మర్ల వినియోగం ద్వారా సుమారు 20 నుంచి 25 శాతం వరకు సాంకేతిక నష్టాలను తగ్గించవచ్చన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థలను బలోపేతం చేసేందుకే కేంద్ర ప్రభుత్వం విద్యుత్ పంపిణీ పునర్వ్యవస్థీకరణ పథకాన్ని (ఆర్డీఎస్ఎస్) అమలు చేస్తోందని వెల్లడించారు. ఈ పథకంలో మొదటి దశ పనులకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆమోదం తీసుకున్నామన్నారు. విద్యుత్ సమస్యలపై వినియోగదారులు టోల్ ఫ్రీ నంబర్ 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

క్లుప్తంగా

ఎస్వీ వైద్య కళాశాలలో ఉద్యోగాలకు దరఖాస్తులు

తిరుపతి తుడా : ఎస్వీ వైద్య కళాశాలలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పలు ఉద్యోగాల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోర్డు చైర్‌పర్సన్, మానసిక అనారోగ్య సంస్థలకు పాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు సభ్యులు, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టు ఒకటి, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈనెల 30వతేదీ లోపు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వివరాలకు www. svmctpt. edu. in వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

14న 'అమర'లో ఆర్థోపెడిక్ వైద్య సేవలు

రేణిగుంట: మండలంలోని కరకంబాడిలో ఉన్న అమర ఆస్పత్రిలో ఈ నెల 14వ తేదీన సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రామ్ చిదంబరం అందుబాటులో ఉంటారని ఆస్పత్రి సీఏఓ వేణుగోపాల్ తెలిపారు. భుజము, మోచేయి, మణికట్టు, చేయి, ఆర్థోస్కోపీ సమస్యలున్న వారు సేవలు పొందవచ్చని వెల్లడించారు. వివరాలకు 7993933777 నంబరులో సంప్రదించాలని సూచించారు.

అడుగడుగునా నీరా'జనం'

- గడప గడపకు మహా పాదయాత్రలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- ఘన స్వాగతం పలికిన ప్రజానీకం

పాకాల : మండలంలోని గానుపెంట పంచాయతీలో వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి బుధవారం నిర్వహించిన గడప గడపకు మహాపాదయాత్రకు అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పట్టారు. పంచాయతీలోని శ్రీరామాపురం, వీరిశెట్టివారిపల్లె, కూనపల్లె, గానుగపెంట, ధనుజావారిపల్లె, లక్ష్మీపురం గ్రామాల్లో మోహిత్‌రెడ్డి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తామని, ఇంకా చేయాలన్సిన పనులు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. పంచాయతీ అభివృద్ధికి ఇప్పటి వరకు రూ.3.66 కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. సచివాలయం, ఆర్‌బీకే భవనాలతోపాటు రోడ్లు, కాలువలు నిర్మించినట్లు వివరించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చూపిన బాటలోనే నిత్యం ప్రజల్లో ఉంటూ కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని స్పష్టం చేశారు. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజలతోనే ప్రయాణం సాగిస్తానని, నమ్మకం ఉంచి గెలిపించాలని విన్నవించారు. రాత్రి 9.30 గంటల వరకు పాదయాత్ర కొనసాగించారు. కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, పారీట మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, సర్పంచ్ భాగ్యలక్ష్మి, సింగిల్ విండో చైర్మన్ మునీశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రాజేంద్ర, హరిప్రసాద్‌రెడ్డి, కపిలేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, యతీశ్వర్‌రెడ్డి, రఘు, రవి, ఆనందకుమార్, రమేష్, మోహన్, వెంకట్రామిరెడ్డి, హేమంత్‌కుమార్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.


మోహిత్‌రెడ్డి వెంట పాదయాత్రలో జన సందోహం


మోహిత్‌రెడ్డికి ఆత్మీయ స్వాగతం పలుకుతున్న ప్రజలు

పాడి రైతులకు మరింత 'సహకారం'

శ్రీకాళహస్తి: పాడి రైతులకు ది కాళహస్తి కో–ఆపరేటివ్ పాల సరఫరా సంఘం వెన్నుదన్నుగా నిలుస్తోందని సంఘం చైర్మన్ మునగాల మధుసూదన్ రావు తెలిపారు. బుధవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సహకారంతో రైతులకు మరింత సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. 1952లో మాధవరావు, వసంతరావు నేతృత్వంలో కో–ఆపరేటివ్ పాల సరఫరా సంఘం ఏర్పడిందని తెలిపారు. ప్రస్తుతం 29 గ్రామాల్లో 46యార్డుల ద్వారా 5,400 మంది పాడి రైతుల వద్ద రోజుకు 9వేల లీటర్ల పాలు సేకరిస్తున్నట్లు వివరించారు. ఇందులో 5వేల లీటర్ల పాలను పట్టణ ప్రజలకు నేరుగా విక్రయిస్తున్నామని, 1,400 లీటర్లతో వివిధ పాల ఉత్పత్తులను తయారు చేస్తున్నామని, మిగిలిన పాలను ప్రైవేటు డెయిరీలకు అమ్ముతున్నట్లు వివరించారు. పాల ఉత్పత్తుల ద్వారా వస్తున్న ఆదాయాన్ని రైతులు, సిబ్బందికే ప్రోత్సాహకాలుగా అందిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పాలసరఫరా సంఘాన్ని మరింత అభివృద్ధి చేయనున్నట్లు స్పష్టం చేశారు. పలు ప్రాంతాల్లో పాలకేంద్రాలను ఏర్పాటు చేసి రూ.కోటి నికర ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు.

సమావేశంలో డైరెక్టర్లు హరినాథ్‌రెడ్డి, రామయ్య, రామమూర్తి, వెంకట్‌రెడ్డి, మునిచంద్రారెడ్డి, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.


పాల సరఫరా సంఘం సభ్యులు

మ్యాన్‌పవర్ సరఫరాకు ఈ–టెండర్

తిరుపతి కల్చరల్ : తిరుపతిలోని టీటీడీ తలనీలాల గోదాముల్లో పనిచేసేందుకు సెమీ స్కిల్స్ మ్యాన్ పవర్ సరఫరాకు ఈ–టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు టీటీడీ పీఆర్‌ఓ టి.రవి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు టెక్నికల్ బిడ్ ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో రూ.600 చెల్లించి, రూ.2.50 లక్షలపే టీటీడీ ఈఓ పేరిట ఈఎండీ తీయాలని సూచించారు. వివరాలకు www. tirumala.org, www.apeprocurment. ap. gov. in వెబ్‌సైట్ లేదా తిరుపతిలోని మార్కెటింగ్ విభాగం జీఎం కార్యాలయం 0877–2264429 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు 'లిటిల్ ఏంజెల్స్' విద్యార్థి

గూడూరురూరల్ : నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో గూడూరు శారదానగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్ 7వ తరగతి విద్యార్థి కేశర్ల చరిత్ రికర్వ్ ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీకలు ఎంపికయ్యా డు. బుధవారం ఈ మేరకు విద్యార్థితో పాటు కోచ్ శివశంకర్‌ను పాఠశాల కరస్పాండెంట్ బి.శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు. ఈ నెల 20 నుంచి వైఎస్సార్ కడప జిల్లా వేంపల్లెలో జరగనున్న జూనియర్ ఆర్చరీ రాష్ట్రస్థాయి పోటీల్లో చరిత్ పాల్గొననున్నట్లు వెల్లడించారు.


విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్

13న సత్యవేడులో మెగా జాబ్ మేళా

నారాయణవనం: సత్యవేడు పాలిటెక్నిక్‌లో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. బుధవారం ఆయన ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రతినిధులతో కలిసి మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జాబ్‌మేళాకు 15 బహుళజాతి కంపెనీలు హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్యామ్‌మోహన్ మాట్లాడుతూ 8, 10వ తరగతి, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన యువతీయువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి రూ.13వేల నుంచి రూ.30వేల వరకు వేతనాలు ఉంటాయని వివరించారు. వివరాలకు 9440374535, 9154449677 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.


జాబ్‌మేళా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం తదితరులు

లారీ ఢీకొని ఒకరి మృతి

ఓజిలి: మండలంలోని రాజుపాళెం వద్ద జాతీయ రహదారిపై బుధవారం లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. చిల్లకూరు మండలం పిడతలపూడికి చెందిన వెంకటేశ్వర్లు బైక్‌పై ఊరూరా తిరుగుతూ మిరపకాయలు అమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మిరపకాయలను ఓజిలిలో విక్రయించి స్వగ్రామానికి వెళుతుండగా వెనుక నుంచి ట్రాలీ లారీ ఢీకొంది. క్షతగాత్రుడిని స్వర్ణ టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో గూడూరుకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించాడు. ఎస్ఐ ఆదిలక్ష్మి ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.


వెంకటేశ్వర్లు మృతదేహం

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

తిరుపతి క్రైం : ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి బుధవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. చంద్రగిరి మండలం తొండవాడకు చెందిన నందకుమార్(45) గోశాల సమీపంలోని టీటీడీ అగరబత్తుల పరిశ్రమలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. మధ్యాహ్నం భోజన సమయంలో గోశాల సమీపంలోని పండ్ల కోసం వెలగ చెట్టు ఎక్కాడు. కొమ్మ విరిగిపోవడంతో కిందపడిపోయాడు. తలకు తీవ్రమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించాడు. ఎస్వీయూ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.


మృతి చెందిన నందకుమార్

మహిళ ఖాతాలో నగదు అపహరణ

నాయుడుపేటటౌన్ : బ్యాంకు అధికారుల పేరుతో ఫోన్ చేసి, క్రెడిట్ కార్డు చార్జీలు తగ్గుతాయని నమ్మించి, ఓ మహిళ ఖాతా నుంచి రూ.28వేల నగదును అపహరించిన ఘటన బుధవారం నాయుడుపేటలో జరిగింది. వివరాలు.. పట్టణానికి చెందిన శిరీషకు కార్పొరేషన్ బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. క్రెడిట్ కార్డు చార్జీ తగ్గించుకోవాలంటే యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని లింక్ పంపించాడు. శిరీష ఆ లింక్ ఓపెన్ చేయగానే ఆమె ఖాతా నుంచి రెండు పర్యాయాలుగా రూ.28వేలు మాయమైంది. దీంతో బాధితురాలు వెంటనే తన బ్యాంకు ఖాతాను ఫ్రీజ్ చేయించింది. సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కల్వర్ట్‌ను ఢీకొన్న ఐషర్ : డ్రైవర్ మృతి

చంద్రగిరి : పూతలపట్టు– నాయుడుపేట జాతీయ రహదారిపై పనపాకం వద్ద కల్వర్టును బుధవారం తెల్లవారుజామున ఐషర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందగా, క్లీనర్ గాయపడ్డాడు. వివరాలు.. బెంగళూరు నుంచి విజయవాడకు పూలమొక్కల లోడుతో ఐషర్ వాహనం బయలుదేరింది. పనపాకం సింగిల్ రోడ్డు క్రాసింగ్ వద్ద అదుపు తప్పి కల్వర్టును ఢీకొంది. దీంతో కృష్ణాజిల్లా గూడూరుకు చెందిన డ్రైవర్ సుదర్శన్ (27), క్లీనర్ అబ్బయ్య క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వారిని బయటకు తీసి చంద్రగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సుదర్శన్ మరణించాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆస్పత్రిలో సుదర్శన్ మృతదేహం

నేర నియంత్రణే లక్ష్యంగా విధులు

- మహిళల ఫిర్యాదులపై అలసత్వం వహిస్తే చర్యలు
- రౌడీ షీటర్లకు నిరంతరం కౌన్సెలింగ్
- తప్పనిసరిగా విజిబుల్ పోలీసింగ్
- క్రైమ్ మీటింగ్‌లో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి


క్రైమ్ మీటింగ్ లో మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం : నేర నియంత్రణే లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వర్తించాలని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం శ్రీపద్మావతి మహిళా వర్సిటీలోని సావేరి అతిథిగృహంలో క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ మహిళలు ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించాలని, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జగనన్నకు చెబుదాం ఫిర్యాదులను సకాలంలో పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. చిన్నారులు, మహిళలకు ఎలాంటి అన్యాయం జరిగినా క్షణాల వ్యవధిలో పోలీసులు అక్కడ ఉండాలని ఆదేశించారు. జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. గంజాయి నిర్మూలనకు సమష్టిగా పనిచేయాలని కోరారు. గంజాయి కేసుల్లో ప్రమేయం ఉంటే ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదన్నారు. గతంలో ఆపరేషన్ పరివర్తన 2.0ను సక్రమంగా అమలు చేసి సత్ఫలితాలు సాధించామని, అదే స్ఫూర్తితో యాంటీ డ్రగ్స్ స్పెషల్ డ్రైవ్‌ను జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించాలని సూచించారు. మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. దసరా సెలవుల నేపథ్యంలో చోరీలను అరికట్టేందుకు కట్టుదిట్టంగా నిఘా పెట్టాలని చెప్పారు. పాత దొంగలు కదలికలపై నిరంతరం దృష్టి పెట్టాలని వెల్లడించారు. ఈక్రమంలోనే రౌడీ షీటర్లకు నిరంతరం కౌన్సిలింగ్ నిర్వహించి వారిలో పరివర్తనం తీసుకురావాలన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై పోలీసు సిబ్బంది డేగ కన్నుతో నిఘా పెట్టాలని ఆదేశించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై డీఎస్పీలు, సీఐలు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. నేరాలను అదుపు చేసేందుకు విజిబుల్ పోలీసింగ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇది అందరూ తప్పనిసరిగా పాటించాలని కోరారు. ప్రతి స్టేషన్‌లో నమోదైన మిస్సింగ్ కేసులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి దర్యాప్తు చేయాలన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులను అప్రమత్తం చేయాలని చెప్పారు. కోర్టు వారి ఆదేశాలు లేకుండా సివిల్ వివాదాల్లో తల దూరిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. న్యాయంగా తమ పరిధిలోని సమస్యలను మాత్రమే పరిష్కరించాలన్నారు. నేషనల్ హైవేలో ప్రమాదాల నివారణకు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా తెల్లవారుజామున బీట్ పోలీసులు ఆయా ప్రాంతాల్లో వాహన డ్రైవర్లను అప్రమత్తం చేస్తూ అవగాహన కల్పించాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. మానవ హక్కుల ఉల్లంఘనపై వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, సమగ్రంగా దర్యాప్తు చేసి కోర్టుకు నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో జనం పడకుండా అవగాహన కల్పించాలని కోరారు. ఎర్రచందనం, ఇసుక రవాణాతోపాటు సారా తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని, ఆయా కేసుల్లో పట్టుబడిన వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు.

పవిత్ర స్వర్ణముఖి పరిరక్షణకు కృషి

శ్రీకాళహస్తి : ముక్కంటి ఆలయానికి ఉత్తరవాహినిగా ప్రవహిస్తున్న స్వర్ణముఖి నది పవిత్రత పరిరక్షకు కృషి చేయాలని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం స్వర్ణముఖి నదిని ఆయన పరిశీలించారు. చైర్మన్ మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు నదిని పరిశుభ్రం చేయించామన్నారు. అలాగే రూ.12కోట్ల వ్యయంతో స్వర్ణముఖి సుందరీకరణకు ఎమ్మెల్యే చర్యలు చేపట్టారని తెలిపారు. అయితే కొందరు గృహ నిర్మాణ వ్యర్థాలను పడేయడం వల్ల నది పవిత్రత దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో నదిలోకి ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు ప్రవేశించకుండా చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలని ఆలయాధికారులను ఆదేశించారు. ఎవరైనా వ్యర్థాలను నదిలో వేస్తే కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కిషోర్‌కుమార్, ప్రతాప్, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.


నదిలో పరిశీలిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

వైఎస్సార్ టీఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఎంజీఎం నగరపాలక ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షులుగా మునిశారద, గౌరవాధ్యక్షుడిగా బి.గంగిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వి.యల్లప్పరెడ్డి, కోశాధికారిగా ఎస్.బాబులాల్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎం.గణేష్‌బాబు, రాష్ట్ర కౌన్సిలర్లుగా బి.గణేష్, బి.వెంకటరమణ, సీహెచ్ కృష్ణ, మహిళా కార్యదర్శులుగా ఈ.సునీత, కె.నాగలక్ష్మితో పాటు ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, ఆడిట్ కన్వీనర్లు, సాంకేతిక నిపుణులుగా మరో 15మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి మొత్తం ప్రక్రియను పర్యవేక్షించారు. నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.


మునిశారద


యల్లప్పరెడ్డి

శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ

పుత్తూరు రూరల్: అప్పలాయగుంటలో టీటీడీ అనుబంధ శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారు జామున శ్రీస్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, అర్చన నిర్వహించారు. ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో యాగశాలలో వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేదోక్తంగా చేపట్టారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మూలవిరాట్‌కు, ఉత్సవర్లకు, పద్మావతీ, ఆండాళ్ అమ్మవార్లకు, జయ విజయులకు, గరుడాళ్వార్‌కు, ఆంజనేయస్వామికి, ధ్వజస్తంభం, ఇతర పరివార దేవతలకు పవిత్ర సమర్పణ గావించారు. సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏఈఓ రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి పర్యవేక్షించారు.

పవిత్రోత్సవాల్లో నేడు : మూడవ రోజు ఉదయం 9–30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.11–30 నుంచి 12–30 గంటల మధ్య మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన నిర్వహించనున్నట్లు ఏఈఓ రమేష్ తెలిపారు.


పవిత్రాల ఊరేగింపు

